ఉత్సవాలకు సర్వం సిద్ధం

నేటి నుంచి రామేశ్వరంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం

- మహాశివరాత్రి వరకు కొనసాగనున్న జాతర



బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన రామలింగేశ్వరస్వామి ఆలయం

షాద్‌నగర్‌రూరల్‌: ప్రముఖ శైవ క్షేత్రంగా విరాజిల్లుతున్న ఫరూఖ్‌నగర్‌ మండల పరిధిలోని రామేశ్వరంలో ఉన్న ఉత్తర రామలింగేశ్వరస్వామి ఆల యం మహాశివరాత్రికి ముస్తాబైంది. శనివారం నుంచి దేవాలయంలో అంగరంగ వైభవంగా బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. అందుకు అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఆలయానికి ఎలా వెళ్లాలి

ఏటా మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఉత్తర రామలింగేశ్వస్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తారు. వీటికి ఉమ్మడి రంగారెడ్డి, మహబూబ్‌నగర్‌, హైదరాబాద్‌ జిల్లాలతో పాటుగా కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు. ఉత్తర రామలింగేశ్వరస్వామి పుణ్యక్షేత్రం షాద్‌నగర్‌ పట్టణానికి 9 కిలోమీటర్ల దూరంలో ఉంది. హైదరాబాద్‌ నుంచి బెంగళూరు వెళ్లే జాతీయ రహదారిపై ఉన్న జడ్చర్ల ఎక్స్‌ప్రెస్‌వే టోల్‌ప్లాజా సమీపంలోని రాయికల్‌ వద్ద ఆలయ ముఖద్వారం ఉంది. ఇక్కడి నుంచి 3 కిలోమీటర్లు ప్రయాణిస్తే రామలింగేశ్వరస్వా మి దేవాలయం వస్తుంది. రామేశ్వరం బ్రహ్మోత్సవాల ఏటా ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడుతుంది.



రాయికల్‌ వద్ద నిర్మించిన ఆలయ ముఖద్వారం

కార్యక్రమాల వివరాలు

మహా శివరాత్రి సందర్భంగా ఉత్తర రామలింగేశ్వర స్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు శనివారం ప్రారంభమై మార్చి 1 వరకు కొనసాగనున్నాయి. మొదటిరోజు గణపతిపూజ, పుణ్యాహవాచనం, రుద్రహోమం, అంకురార్పణం, ధ్వజారోహణం నిర్వహిస్తారు. ఆదివారం ఉదయం 10 గంటలకు పర్వతీ పరమేశ్వరుల కల్యాణోత్సవం, సోమవారం ఏకాదశి రుద్రాభిషేకం, నందిసేవ, రాత్రి అగ్నిగుండాలు, మంగళవారం ద్వాదశి రుద్రాభిషేకం, బుధ వారం మహాశివరాత్రి, గురువారం చతుర్థశి రుద్రహోమం, పూర్ణాహుతి, శుక్రవారం రాత్రి 9గంటలకు పార్వతీ పరమేశ్వరుల రథోత్సవం, శని వారం శివ తీర్థము తదితర కార్యక్రమాలతో ఉత్సవాలు ముగుస్తాయి.



కోనేరులో ఏర్పాటు చేసిన శివుడి విగ్రహం

అన్ని సౌకర్యాలు కల్పించాం



బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు చర్యలు చేపట్టాం. ప్రత్యేకంగా శాశ్వత క్యూ లైన్లు ఏర్పాటు చేశాం. టెంట్లు, మంచినీటి వసతి, వైద్య సదుపాయాలను సిద్ధం చేశాం. అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పోలీసులతో పటిష్ట నిఘా నిర్వహిస్తున్నాం.

– శివకుమార్‌, ఆలయ ఈఓ, రామేశ్వరం

ఆలయ నేపథ్యమిదే

రావణాసురుడిని వధించిన తరువాత శ్రీరాముడు అయోధ్యకు బయలు దేరాడని, సీతాదేవిని అరణ్య మార్గం నుంచి తీసుకువెళ్తూ కోటి లింగాలను ప్రతిష్ఠించాడని పురాణాలు చెబుతున్నాయి. ఈ క్రమంలో ఫరూఖ్‌నగర్‌ మండలం రామేశ్వరంలో శ్రీరాముడు శివ పూజ కోసం లింగాన్ని ప్రతిష్ఠించాడు. ఆ శివలింగాన్నే నేటికి భక్తులు పూజిస్తున్నారు. సాక్షాత్తు శ్రీరాముడే శివ లింగాన్ని ప్రతిష్ఠించినందుకు రామేశ్వరమనే పేరు వచ్చింది. ఇక్కడి శివలింగం ఎంతో మహిమగలదని భక్తుల నమ్మకం. గర్భగుడిలోని శివ లింగం ఏటా పెరుగుతూ భక్తులను ఆశ్చర్యానికి గురి చేస్తుంది. ప్రతి పౌర్ణమికి భక్తులు వేల సంఖ్యలో వచ్చి దర్శించుకుంటారు.



చేవెళ్ల: పడిపూజలో నాయకులు



కొందుర్గు: ఎదిరలో మహాపడిపూజ

మార్మోగిన శివ నామస్మరణ

చేవెళ్ల: హరహర మహాదేవా శంభో శంకరా... స్వామి శరణం శివప్ప అంటూ శివ నామస్మరణతో మండలంలోని నాంచేరి గ్రామం మార్మోగింది. శుక్రవారం గ్రామంలో ముడిమ్యాల సహకార సంఘం చైర్మన్‌ గోనే ప్రతాప్‌రెడ్డి, చేవెళ్ల మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ గడ్డమీది పెంటయ్యగౌడ్‌ ఆధ్వర్యంలో శివస్వాముల మహాపడి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ క్రతువును గురుస్వామి నరేష్‌కుమార్‌ కన్నుల పండువగా జరిపించారు. గణపతి పూజ, శివలింగానికి రుద్రాభిషేకం తదితర పూజలను భక్తిశ్రద్ధలతో చేశారు. మండలంలోని శివ మాల ధరించిన స్వాములు పెద్దసంఖ్యలో పడి పూజలో పాల్గొన్నారు.

ఘనంగా శివస్వాముల మహాపడి పూజ

కొందుర్గు: మండల కేంద్రంలోని పంచలింగేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణంలో, జిల్లేడ్‌ చౌదరిగూడ మండలం ఎదిర గ్రామంలో శుక్రవారం ద్వాదశ జ్యోతిర్లింగ మహాపడిపూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివస్వాములకు ఇరుముడి కట్టే కార్య క్రమం చేశారు. గురుస్వామి భూపాలచారి, సత్యనారాయణ, యాదయ్య, ఆయా గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రేపు గురుకులాల ప్రవేశ పరీక్ష

షాద్‌నగర్‌రూరల్‌: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఆదివారం పరీక్ష నిర్వహిస్తున్నామని స్థానిక గురుకుల మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ నీతా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని నూర్‌ ఇంజనీరింగ్‌ కళాశాల భవనంలో కొనసాగుతున్న గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష ఉందన్నారు.

మొయినాబాద్‌లో..

మొయినాబాద్‌రూరల్‌: గురుకుల పాఠశాల ప్రవేశాల కోసం ఆదివారం రాత పరీక్ష నిర్వహిస్తున్నామని చేవెళ్ల సాంఘిక సంక్షేమ పాఠశాల ప్రిన్సిపాల్‌ మాలతీ తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు మండలంలోని తోల్‌కట్ట సమీపంలో గల ఎస్‌వీ ఇంజనీరింగ్‌ కళాశాలలో పరీక్ష కొనసాగుతుందని చెప్పారు.

మాతృభాషను ఆదరిద్దాం

షాద్‌నగర్‌రూరల్‌: అమ్మలాంటి మాతృభాషను ఆదరించి పరభాష వ్యామోహాన్ని విడనాడుదామని గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ నీతా అన్నారు. శుక్రవారం కళాశాలలో మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్‌ మాట్లాడుతూ... అమ్మ ఉగ్గు పాలతో నేర్చుకున్న మాతృభాష ఎంతో గొప్పదని అన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్‌ ప్రిన్సిపాల్‌ సృజన, అధ్యాపకులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

మొగిలిగిద్దలో..

ఫరూఖ్‌నగర్‌ మండలం మొగిలిగిద్ద జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు వెంకటహరికృష్ణ ఆధ్వర్యంలో మాతృభాషా దినోత్సవం నిర్వహించారు. తెలుగు భాష గొప్పతనాన్ని తెలియచేస్తూ విద్యార్థులకు వివిధ అంశాలలో పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఈఓ మనోహర్‌ హాజరై ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

ఎలికట్టలో..

ఫరూఖ్‌నగర్‌ మండల పరిధిలోని ఎలికట్ట ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు సక్కుబాయి ఆధ్వర్యంలో మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ అంశాలలో నిర్వహించిన ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను అలరించాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రవీణ్‌కుమార్‌, కృష్ణమ్మ, అరుణ, రేణు, మాలతి, స్వప్న, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



బహుమతులను అందజేస్తున్న ఎంఈఓ మనోహర్‌

భావితరాలకు స్వచ్ఛమైన పుడమి

సీజీఆర్‌ ఫౌండర్‌ లక్ష్మారెడ్డి

కడ్తాల్‌: భవిష్యత్‌ తరాలకు స్వచ్ఛమైన పుడమిని అందించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని, కౌన్సిల్‌ ఫర్‌ గ్రీన్‌ రెవల్యూషన్‌ ఫౌండర్‌ కోర్బోలు లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. మండల పరిధిలోని అన్మాస్‌పల్లి గ్రామ సమీపంలోని ఎర్త్‌ సెంటర్‌లో గత రెండు రోజుల నుంచి నిర్వహించిన పర్యావరణ అవగాహన సదస్సు శుక్రవారంతో ముగిసింది. సదస్సుకు జిల్లాలోని పీఎంశ్రీ మోడల్‌ స్కూల్‌ షాబాద్‌కు చెందిన 300 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. ప్రకృతిని విస్మరిస్తే జీవకోటి మనుగడ ప్రశ్నార్థకమవుతుందని, సహజసిద్ధ వనరులను కాపాడే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని చెప్పారు. చిన్నప్పటి నుంచే విద్యార్థులకు పర్యావరణంపై అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం సీజీఆర్‌ సంస్థ అధికార ప్రతినిధి జ్ఞానేశ్వర్‌ అడవుల రకాలు, విత్తన తయారీ, బయో ఎంజైమ్‌ గురించి అవగాహన కల్పించారు. తడి పొడి చెత్త వేరు చేసే విధానాన్ని ప్రదర్శనతో పర్యావరణ వేత్త అన్నమయ్య వివరించారు. కార్యక్రమంలో స్కూల్‌ వైస్‌ ప్రిన్సిపాల్‌ రాఘవేంద్ర, సీజీఆర్‌ సిబ్బంది నగేశ్‌, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పర్యావరణ పరిరక్షణపై ప్రసంగిస్తున్న లక్ష్మారెడ్డి

కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం

బీసీ కమిషన్‌ రాష్ట్ర సభ్యుడు జయప్రకాష్‌

ఇబ్రహీంపట్నం రూరల్‌: కాంగ్రెస్‌ ప్రభుత్వ హయాంలోనే బీసీలకు సామాజిక న్యాయం దక్కుతుందని బీసీ కమిషన్‌ రాష్ట్ర సభ్యుడు రాపోలు జయప్రకాష్‌ ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం ఆదిబట్ల మున్సిపాలిటీ కార్యాలయంలో మాజీ సర్పంచ్‌ ఈసీ శేఖర్‌గౌడ్‌ ఆధ్వర్యంలో కులగణన రీసర్వేపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జయప్రకాష్‌ మాట్లాడుతూ.. బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించడానికి కులగణన చేసి మొదటి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. దేశంలోనే ఎవరూ చేయని సాహసోపేతమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన నాయకుడన్నారు. అసెంబ్లీలో తీర్మానం చేసి చట్టబద్ధత కల్పించడానికి కృషి చేస్తున్నరన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు న్యాయం దక్కుతుందన్నారు. కాంగ్రెస్‌ పార్టీ పేద, బడుగు బలహీన వర్గాలకు పెద్దపీట వేస్తుందన్నారు. కులగణనలో ఇప్పటికీ పేర్లు నమోదు చేసుకోని వారికి ఈ నెల 28వ తేదీ వరకు చివరి అవకాశం ఉందని చెప్పారు. కార్యక్రమంలో కమిషనర్‌ బాలకృష్ణ, నాయకులు రజినీకాంత్‌గౌడ్‌, కృష్ణ, దేవగౌడ్‌, దర్శన్‌, సాయిబాబాగౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.



జయప్రకాష్‌ను సన్మానిస్తున్న కమిషనర్‌ బాలకృష్ణ

నేడు ఎమ్మెల్యే మల్‌రెడ్డి పర్యటన

ఇబ్రహీంపట్నం: నియోజకవర్గంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి శనివారం వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలల్లో పాల్గొననున్నట్లు క్యాంపు కార్యాలయ వర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి. ఉదయం 10:30 గంటలకు బాటసింగారంలోని బ్రిలియంట్‌ కాలేజీలో డ్రగ్స్‌పై అవగాహన, పెద్దఅంబర్‌పేట ఇందిర గార్డెన్స్‌లో అబ్దుల్లాపూర్‌మెట్‌ మండలానికి సంబంధించిన రూ.1.63 కోట్ల కల్యాణలక్ష్మీ, షాదీముబారక్‌ లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ, మధ్యాహ్నం 12:30 గంటలకు రాందాస్‌పల్లి చౌరస్తాలో రూ.10.50 కోట్ల వ్యయంతో నిర్మించే రోడ్డు పనులకు శంకుస్థాపన, ఒంటి గంటకు పోచారం, కర్ణంగూడ పరిధిలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయ దర్శనం, మధ్యాహ్నం 1:30 గంటలకు ఇబ్రహీంపట్నంలో, 2 గంటలకు ఖానాపూర్‌లో బస్తీ దవాఖానాల ప్రారంభోత్సవాలకు ఎమ్మెల్యే హాజరుకానున్నట్లు వెల్లడించారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

అబ్దుల్లాపూర్‌మెట్‌: పెద్దఅంబర్‌పేట, తుర్కయంజాల్‌ మున్సిపాలిటీలతో పాటు అబ్దుల్లాపూర్‌మెట్‌ మండలానికి చెందిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌ లబ్ధిదారులకు శనివారం పెద్దఅంబర్‌పేటలోని ఇందిరాగార్డెన్స్‌లో చెక్కుల పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్‌ బి.సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఉదయం 11.30 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే రంగారెడ్డి హాజరై లబ్ధిదారులకు చెక్కులు అందజేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

నిర్మించారు.. వదిలేశారు

నిరుపయోగంగా ప్రభుత్వ భవనాలు

- జనావాసాలకు దూరంగా ఏర్పాటు
- వృథాగా అవుతున్న ప్రజాధనం



పెద్దమంగళారంలో నిరుపయోగంగా మారిన ఎస్సీ బాలుర హాస్టల్‌ భవనం



సురంగల్‌ కాలనీలో అంగన్‌వాడీ భవనం

మొయినాబాద్‌: రూ.లక్షల్లో ప్రజాధనం ఖర్చుచేసి నిర్మించిన ప్రభుత్వ భవనాలు వృథాగా మారాయి. భవనాలను అనువైన చోట నిర్మించపోవడంతోపాటు కనీసం ఇతర అవసరాలకైనా వాడుకపోవడంతో అవి నిరుపయోగంగా మిగిలిపోయాయి. విద్యార్థులకు ఉపయోగపడేలా నిర్మించాల్సిన భవనాలను అనాలోచితంగా ఎక్కడపడితే అక్కడ నిర్మించేశారు. మొయినాబాద్‌ మండల కేంద్రంలో బీసీ బాలికల వసతి గృహం భవనాన్ని పదిహేనేళ్ల క్రితం రూ.40 లక్షలు ఖర్చుచేసి నిర్మించారు. అయితే జనావాసాలకు దూరంగా శ్మశానవాటిక పక్కన హాస్టల్‌ భవనం నిర్మించడంతో విద్యార్థినులు అందులోకి వెళ్లేందుకు భయాందోళన చెందారు. దాంతో అప్పటినుంచి వృథాగా వదిలేయడంతో ఆ భవనం బూత్‌బంగ్లాలా మారింది. ప్రస్తుతం ఆ భవనం తలుపులు, కిటికీలకు ఉన్న ఇనుప గ్రిల్స్‌ను గుర్తుతెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. తొమ్మిదేళ్ల క్రితమే మొయినాబాద్‌లో బీసీ బాలికల హాస్టల్‌ను ప్రభుత్వం పూర్తిగా ఎత్తేసింది. ఇక హాస్టల్‌ కోసం నిర్మించిన భవనాన్ని ఎవరూ పట్టించుకోవడంలేదు.

అనాలోచిత నిర్ణయంతో ఇబ్బంది

మొయినాబాద్‌ మున్సిపాలిటీ పరిధిలోని పెద్దమంగళారంలో ఎస్సీ బాలుర వసతి గృహం కోసం నిర్మించిన భవనం నిరుపయోగంగా మారింది. తొమ్మిదేళ్ల క్రితం హాస్టల్‌ మూతపడటంతో ఆ భవనాన్ని వృథాగా వదిలేశారు. కొంత కాలం పాటు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను అందులో నిర్వహించి భవనం సరిపోవడంలేదని ప్రైవేటు భవనంలోకి గురుకులాన్ని మార్చారు. దీంతో ఆ భవనం ప్రస్తుతం ఖాళీగా ఉంది. హిమాయత్‌నగర్‌లో 15 సంవత్సరాల క్రితం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకోసం మూడు అదనపు గదులను సుమారు రూ.10 లక్షల నిధులతో పాఠశాలకు దూరంగా నిర్మించారు. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆ గదుల్లోకి వెళ్లలేని పరిస్థితి రావడంతో నిరుపయోగంగా వదిలేశారు. అందులో ఒక గదిని మాత్రం ప్రస్తుతం పిల్లలకు ఫిజియోథెరఫీ చేసేందుకు ఉపయోగిస్తున్నారు. ఇక సురంగల్‌ గ్రామంలో పన్నెండేళ్ల క్రితం రూ.5 లక్షలతో అంగన్‌వాడీ భవనాన్ని సైతం ఇదే తరహాలో అనాలోచితంగా నిర్మించారు. గ్రామానికి కిలోమీటర్‌ దూరంలో ఉన్న కాలనీలో ఏర్పాటు చేశారు. దీంతో చిన్నారులు అంతదూరం నడిచి వెళ్లే పరిస్థితి లేకపోవడంతో భవనాన్ని వృథాగా వదిలేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూర్చేందుకే ఇలా అనాలోచితంగా భవనాలు నిర్మించి వదిలేశారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కు అందజేత



తలకొండపల్లిలో బాధితుడికి చెక్కు అందిస్తున్న మోహన్‌రెడ్డి

ఆమనగల్లు: తలకొండపల్లి మండల కేంద్రానికి చెందిన మహేశ్వరి అనారోగ్యంతో ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందింది. ఆమెకు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో రూ.16 వేలు ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరయ్యాయి. తలకొండపల్లి మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో బాధిత కుటుంబ సభ్యులకు పీసీసీ కిసాన్‌సెల్‌ కార్యదర్శి మోహన్‌రెడ్డి సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కును అందించారు. కార్యక్రమంలో మార్కెట్‌ కమిటీ డైరెక్టర్‌ అజీం, డీసీసీ కార్యదర్శి రవీందర్‌యాదవ్‌, నాయకులు కృష్ణ, రమేశ్‌, రామ్మోహన్‌రెడ్డి, నర్సింహారెడ్డి, మల్లేశ్‌, నర్సింహ, యాదగిరి, సురేశ్‌, గణేశ్‌, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పన్ను చెల్లింపుతో అభివృద్ధి

తుర్కయంజాల్‌: ప్రతి ఒక్కరూ పన్నులను సకాలంలో చెల్లించి దేశ అభివృద్ధికి సహకరించాలని టెస్కాబ్‌ వైస్‌ చైర్మన్‌, డీసీసీబీ చైర్మన్‌ కొత్తకుర్మ సత్తయ్య కోరారు. తుర్కయంజాల్‌ రైతు సేవా సహకార సంఘంకు చెందిన 10 ఆస్తులకు సంబంధించిన పన్ను రూ.8,66,604 చెక్కును శుక్రవారం మున్సిపల్‌ సిబ్బందికి అందజేశారు. కార్యక్రమంలో సంఘం సీఈఓ వై.రాందాసు, మున్సిపల్‌ రెవెన్యూ అధికారి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

ఆమనగల్లు: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, కస్తూర్బాగాంధీ గిరిజన బా లికల విద్యాలయం, గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమంలో భాగంగా ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. ఆయా పాఠశాలల్లో డాక్ట ర్లు శ్రీకాంత్‌, సృజల, కంటి వైద్య సహాయకు లు చంద్రశేఖర్‌ల ఆధ్వర్యంలో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు.అవసరమైన వా రికి ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేశారు.

క్లుప్తంగా

ఆలయాల అభివృద్ధికి కృషి

కాంగ్రెస్‌ పార్టీ చేవెళ్ల ఇన్‌చార్జి భీంభరత్‌

షాబాద్‌: దేవాలయాల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని కాంగ్రెస్‌ పార్టీ చేవెళ్ల అసెంబ్లీ ఇన్‌చార్జి పామెన భీంభరత్‌ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని సాయిరెడ్డిగూడ మల్లన్న ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నూతనంగా నిర్మిస్తున్న గుడికి రూ.50 వేల నగదు విరాళంగా ఆలయ కమిటీ నిర్వాహకులు పొన్న సుధాకర్‌రెడ్డి, దోనూరు గోపాల్‌లకు అందజేశారు.

స్వచ్ఛమైన నీటిని అందించండి

తహసీల్దార్‌ అజాంఅలీ



వంట పాత్రలు పరిశీలిస్తున్న తహసీల్దార్‌

కేశంపేట: స్వచ్ఛమైన తాగునీటిని విద్యార్థులకు అందించాలని తహసీల్దార్‌ అజాంఅలీ సూచించారు. మండల పరిధిలోని పాటిగడ్డ గ్రామంలో ఉన్న కేజీబీవీ పాఠశాలను ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణతో పాటు కిచెన్‌ షెడ్‌ను పరిశీలించారు. కిచెన్‌షెడ్‌లో నిల్వ ఉన్న కూరగాయలతో పాటు వంట పాత్రలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. పాఠశాల నిర్వహణ పైన విద్యార్థినులను అడిగి వివరాలను తెలుసుకున్నారు. నాణ్యమైన భోజనంతో పాటు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని పాఠశాల ఎస్‌ఓ గౌసియాకు సూచించారు. విద్యార్థినుల ఆరోగ్యం పట్ల తగిన జాగ్రత్తలను పాటించాలని తెలిపారు.

ఉపాధి కూలీలకు టెంట్లు ఏర్పాటు చేయండి

కొందుర్గు: వేసవి కాలంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలకు టెంట్లు ఏర్పాటు చేయాలని ధర్మ సమాజ్‌ పార్టీ మండల అధ్యక్షుడు డప్పు రవీందర్‌ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. కూలీలు వేసవి తాపానికి తట్టుకోలేక చెట్ల నీడకు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. కూలీలు పనిచేసే ప్రదేశంలో తాగు నీరు, ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. లేకపోతే ధర్మ సమాజ్‌ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

పశువుల ఆరోగ్యంపై అప్రమత్తత అవసరం



పశుపోషకులకు మందులు పంపిణీ చేస్తున్న డాక్టర్‌ చంద్రశేఖర్‌రెడ్డి

షాబాద్‌: పశువుల ఆరోగ్యం పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని రేగడి దోస్వాడ పశువైద్యాధికారి చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని పోతుగల్‌ గ్రామంలో పశువుల వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో 12 పాడి ఆవులకు గర్భకోశ వ్యాధి చికిత్సలు చేశారు. 26 పశువులకు చూడి పరీక్షలు నిర్వహించి, 30 దూడలు, గేదెలకు నట్టల నివారణ మందులు తాగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సకాలంలో పశువులకు వైద్యం అందిస్తే అధిక పాల దిగుబడి వస్తుందని తెలిపారు. మేలు రకం పశువుల ఎంపిక ద్వారా ఆదాయం పొందవచ్చని చెప్పారు. కార్యక్రమంలో గోపాలమిత్ర విద్యాసాగర్‌, వైద్య సిబ్బంది శ్రీనివాస్‌, సుధాకర్‌, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నేడు హామీ పనులపై ప్రజావేదిక

శంకర్‌పల్లి: ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ నిమిత్తం మండల పరిషత్‌ కార్యాలయంలో శనివారం ఉదయం ప్రజావేదిక ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ వెంకయ్య ఓ ప్రకటనలో తెలిపారు. 2023 ఏప్రిల్‌ నుంచి 2024 మార్చి వరకు జరిగిన ఉపాధి హామీ పనులపై సమావేశం ఉంటుందని, దీంట్లో ఉపాధి హామీ కూలీలకు సంబంధించిన వేతనాలు, చెల్లింపులు, పనుల నాణ్యత, ఇతర పనులపై ప్రజావేదికలో ప్రవేశ పెట్టనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ హాజరై, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

స్కాలర్‌షిప్‌నకు విద్యార్థుల ఎంపిక

కేశంపేట: నిరుపేద విద్యార్థుల చదువుకు ఆర్థిక సాయం అందించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఎన్‌ఎంఎంఎస్‌తో ప్రోత్సహిస్తోంది. ఇటీవల కేంద్ర ప్రభుత్వం నేషనల్‌ మీన్స్‌ కమ్‌ మెరిట్‌ పథకం(ఎన్‌ఎంఎంఎస్‌) ద్వారా 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రతిభ పరీక్షలను నిర్వహించింది. అందులో కేశంపేట జెడ్పీ పాఠశాలకు చెందిన విద్యార్థులు సత్తా చాటారు. స్కాలర్‌షిప్‌నకు ఎంపికైన ఆదిత్య, సరయూ, చందనలను మండల విద్యాధికారి చంద్రశేఖర్‌ అభినందించారు. వీరికి వచ్చే విద్యా సంవత్సరం నుంచి రూ.12 వేలు ఇవ్వనున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు.